## 18

# మీరు ఏ దిశగా ప్రయాణిస్తున్నారు?

## (మత్తయి 7:13-20)

వాక్యం ప్రకారం మనమీ లోకంలో యాత్రికులమే గాని నివాసులము కాదు. అయితే "మన యొక్క ప్రయాణం ఏ దిశలో ఉన్నదన్నదే" ప్రశ్న. యాత్రికుని యొక్క మొదటి ప్రాధాన్యత వేగం కాదు కానీ గమ్యమే. "ప్రయాణ వేగం నిర్దిష్ట దిశలో లేనట్టయితే దీనికంటే నీచం మరొకటి ఉండదు."[1] నేను ప్రపంచమంతటా ఫర్యటించాను, వివిధ హైవే రోడ్లలో అనుమతించబడిన అత్యధిక వేగంతో ప్రయాణించాను. కొండమీది ప్రసంగం చివరకు వచ్చిన మనలను *ఆత్మీయంగా* మనం ఏ దిశగా ప్రయాణిస్తున్నామని యేసు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నకు సమాధానం రెండు ప్రశ్నలకు సమాధానమియ్యుట వలన దొరుకుతుంది.

### మీరు ఏ మార్గాన్ని ఎంచుకున్నారు? (7:13, 14)

మీ యాత్ర నిమిత్తం మీరు ఏ మార్గాన్ని ఎంచుకున్నారన్నది మొదటి విషయం. మత్తయి 7:13, 14లో ప్రభువు రెండు మార్గాల గురించి ప్రస్తావిస్తున్నారు:

> ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునైయున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది, దాని కనుగొనువారు కొందరే.

ఈ వచనాలలో మనం నాలుగు వ్యత్యాసాలను చూస్తున్నాం.

#### రెండు దారులు

యాత్రికునికి రెండు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఒకటి విశాలమైన దారి. "విశాలము" broad (*euruchoros*) అన్న పదమునకు "విస్తీర్ణముగానున్న, వెడల్పుగానున్న" అని అర్థము.[2] ఈ దారిలో పరస్పర విరుద్ధ అంశములు అనేకములున్నాయి. దీనిలోనే అనేక వీధులున్నాయి:

- విజయం కోసం కష్టించి పని చేసిన వారికై ఒక వీధి, అలాగే ఏ పని చేయక సోమరితనంతోనే ఆనందాన్ని వెతుక్కునే వారికై ఒక వీధి దీనిలో ఉన్నాయి.
- రక్షణ నిమిత్తం తమ సత్‌క్రియలపైనే ఆధారపడుతున్న నైతికంగా సజ్జనులు అయిన వారికై ఒక వీధి. అలాగే అనైతికంగా, దేవునినెరుగకుండా జీవిస్తున్న వారికై ఒక వీధి దీనిలో ఉన్నాయి.
- మానవ ఆచారాలు, మంత్రోపదేశములను అనుసరించు మతస్థులు కొరకై ఒక వీధి. మతముయందు నమ్మిక లేని, నాస్తికులు, జ్ఞానముననుసరించువారు నిమిత్తం ఒక వీధి ఇందులో ఉన్నాయి.

ఈ మార్గంలో ఎలాంటి అడ్డంకులు ఉండవు. అలాగే ఏ హద్దులు ఉండవు. మీరు ఏం చేయాలో అలా చేయవచ్చు, ఎలా ఉండాలో అలా ఉండవచ్చు. "ఇది సులభమైన మార్గము, ఇది నాశనమునకు దారి తీస్తుంది" అని RSV పేర్కొంటుంది.

తరువాత మనకు సంకుచితమైన మార్గ కనిపిస్తుంది. "సంకుచితమైన" (*thlibo*) అను పదమునకు "నొక్కుట"[3] మరియు దగ్గరగా "ఒత్తిడిపెట్టు"[4] అని అర్థం. మునుపటి దారివలె ఇది విశాలమైనది, వెడల్పయినది కాదు. "ఇది ఇరుకుగా యుంటుంది, ఇది జీవమునకు దారి తీస్తుంది" అని RSVలో చెప్పబడింది. జీవమునకు పోవు మార్గము సులభముగా ఉంటుందని యేసు ఎన్నడూ చెప్పలేదు.[5]

యేసు చెప్పినందున కాదు, జీవమునకు పోవు మార్గము ఇరుకుగా ఉంటుంది. అలాగే ఇది కరుకుగానూ ఉంటుంది. సత్యము యొక్క స్వభావం ఇదే గనుక ఇరుకుగా ఉంటుంది. 2 మరియు, 2 కలిపితే నాలుగు ఎలా అవుతుందో, అలాగే సత్యము ఎల్లప్పుడూ ఇరుకుగానే ఉంటుంది. వీటి కూడిక 5 లేదా 7 అవదు; ఎప్పుడూ నాలుగే అవుతుంది. ఇది సత్యము యొక్క ఇరుకుతనం. సూర్యుడెప్పుడూ తూర్పునే ఉదయిస్తాడు. పశ్చిమాన లేదా ఉత్తరాన సూర్యుడు ఉదయించడు. ఎప్పుడూ తూర్పునే ఉదయిస్తాడు. ఇది సత్యము యొక్క పరిధి.

"ఇరుకు లేదా కురచ" అనే పదాన్ని మనం ఇష్టపడము. "కురచ బుద్ధి" అని పిలువబడుటకు మనం ఇష్టపడము. ఒక సంవత్సరం, ఒక క్రైస్తవ కాలేజీలో బోధన నిమిత్తం వెళ్ళినప్పుడు, ఒక వ్యక్తి నా చేతికి ఒక చిన్న పుస్తకాన్నిచ్చాడు. ఆరు అంగుళాల పొడవు, ఒక అంగుళం వెడల్పు, ఒక అంగుళం వెడల్పు ఉన్న ఈ చిన్న నోట్స్ పై భాగంలో "కురచ బుద్ధిగల వారికైన నోట్స్" అన్న మాట వ్రాసి ఉంది. దీనికి ఉన్న అర్థం మాకు అర్థమై పరిహాసం కోసం యిలా వ్రాసి ఉంటారని మేము భావించాము.

ఈ రోజున సహనం యొక్క అవసరత ఎంతైనా ఉంది. సహనంగా ఉండాల్సిన సమయం ఉంది. అలాగే కొన్నిసార్లు అసహనంగా ఉండాల్సిన అవసరం కూడ ఉంది. జార్జ్ దబ్ల్యూ. బైలీ ఈలాగు వ్రాస్తున్నాడు,

> ఇతరుల విషయంలో మనం సహనం కలిగియుండాలి. వారి అభిప్రాయముల విషయంలోనూ సహనం కలిగియుండాలి. అయితే సహనం లేకుండగా ఉండవలసిన సమయం ఉంది. ఇటువంటి సమయంలో అసహనం ఎంతో మేలుగా ఉంటుంది. మన దేవుడు దూషణకు గురవుతున్నప్పుడు మనం సహించకూడదు. దేవుని వాక్యం ప్రశ్నించబడుతున్నప్పుడు మనం సహనంగా ఉండకూడదు. మన విశ్వాసం పరిహాసానికి గురవుతున్నప్పుడు, ఒకరి అభిప్రాయమే సత్యముగా ఆరోపించబడుతున్నప్పుడు, దైవిక సత్యాలు హేళనకు గురవుతున్నప్పుడు మనం సహనంగ ఉండకూడదు.[6]

జీవమునకు దారితీయు మార్గము ఇరుకుగానున్నాగాని, ఇది సరిపడినంతగా ఉంటుంది. "అన్ని తరములవారు, అన్ని కాలమువారు, అన్ని భాషల ప్రజలు, అన్ని జాతులు మరియు దేశముల ప్రజలు"[7] – యేసుని వెంబడించుటకు యిష్టపడినవారందరు (1 యోహాను 1:7 చూడు). దేవుని చేతిలో చెయ్యివేసి నడుచుటకు సరిపడ విశాలముగలది ఉంటుంది (కొలొస్సయులకు 2:6 చూడు). అన్నిటికంటే ముఖ్యముగా, ఇది దేవుని మార్గము (యోహాను 14:6 చూడు).

మన ముందు రెండే అవకాశములున్నాయి – విశాల మార్గం లేదా ఇరుకు మార్గం.

లోకమునకు ఈ అవకాశం నచ్చదు. “జీవమునకు అనేక మార్గాలున్నాయని” కొంతమంది చెబుతారు. కొందరు మానవత్వమనే అంశాన్ని పట్టుకు వ్రేలాడుతూ మనందరి ముందు ఒక్కటే మార్గముందని ఆ మార్గంలోనే అందరూ ప్రయాణిస్తున్నారని అది నిత్య రక్షణకు దారి తీస్తుందని మాటలు చెప్తుంటారు. మనుష్యులకు ఇష్టమైన అవకాశములను దేవుడు ఇవ్వడు. మనకు రెండు మార్గములను ఆయన ఇస్తున్నాడు. అవే విశాల మార్గం – మరియు ఇరుకు మార్గం – ప్రతి ఒక్కరూ ఈ రెండింటిలో ఏదో ఒక దానిలో ఉంటారు.

**రెండు ద్వారములు**

తరువాతదిగా, యేసు రెండు ద్వారముల గురించి మాట్లాడుతున్నారు. *ఒకటి విశాలమైన ద్వారాం.* మన వాక్యం ప్రకారం, రెండు ద్వారములు “ప్రవేశమునకు అర్హమైనవే,” కాని ఈ ద్వారం ఎంతో వెడల్పయినది. దీనిలో ప్రవేశిస్తున్నామన్న విషయాన్ని ఎక్కువమంది గ్రహించలేరు. మీరు ఈ ద్వారము యొద్ద నిలుచుండి కుడవైపునకు, ఎడమవైపునకు చూస్తే మీకు ద్వార బంధములు కనిపించవు, అంత విశాలంగా ఉంటుంది.

ఈ ద్వారము గుండా ప్రవేశించడం పెద్ద కష్టమేమీ కాదు. దీని ద్వారా ప్రవేశిస్తుండగా మీరు ఎంత “సామానునైనా” మోసుకు వెళ్ళవచ్చు. దేన్నీ వదులవలసిన అవసరం లేదు. మీ పాపముతోను, స్వార్థముతోనూ, స్వనీతితోనూ, గర్వముతోనూ, దురభిప్రాయముతోనూ మీరు ఇందులో ప్రవేశించవచ్చు.

తరువాతదిగా మనం *ఇరుకైన, సంకుచితమైన ద్వారమును* చూస్తాం. KJVలో ఇది సన్నని ద్వారము “s-t-r-a-i-g-h-t”గా ఇవ్వబడింది, నిత్య జీవమునకు దారి తీయు మార్గము. “ఇరుకు మరియు తిన్నని” “s-t-r-a-i-g-h-t దని” చాలామంది చెబుతారు. అయితే KJVలో వాడబడిన పదం s-t-r-a-i-g-h-t కాదు కాని strait. ఇది లాటిన్ పదం దీనికి “సంకుచితమైన” అని అర్థం. ఒక సముద్ర సంధిని మరో రెండు పెద్ద సంధులతో కలిపిన అర్థంలో ఇవ్వబడే పదాన్ని వాడుతున్నారు. ఉదాహరణకు, మధ్యధరా సముద్రమును అట్లాంటిక్ సముద్రముతో కలిపే గిబ్రాల్టర్ సన్నని సంధి.

13వ వచనంలో వాడబడిన *stenos* అన్న గ్రీకు పదమునకు “ఇరుకు”[8] అని అర్థం. ఇదే పదం 14వ వచనంలో “చిన్నది” (small) అన్న అంశంతో వాడబడింది. ఈ ద్వారం చిన్నది కాబట్టి ఏదో యధాలాపంగా మీరు ఈ ద్వారమున ప్రవేశింపలేరు. దీన్ని గుర్తుపట్టడం కష్టం. దీని కొరకు మీరు వెదకాలి, అనుకోకుండా గాకుండా కావాలనే ఇందులో ప్రవేశించగలము. ఈ ద్వారము చిన్నది కాబట్టి ఒకసారికి ఒక వ్యక్తి మాత్రమే ప్రవేశింపగలడు. విశాలమైన ద్వారము గుండా అనేకమంది గుంపులుగా వ్రేశించగలరు గాని ఇరుకు ద్వారమున ఒక్కొక్కరు మాత్రమే వ్రేశింపగలరు. అలాగే ఇది ఇరుకయినది కాబట్టి ఇందులో ప్రవేశించుటకు అనవసర సామానును వదిలించుకోవాల్సిందే.[9] “ఎవడైనను నన్ను వెంబడింపగోరినయెడల, *తన్నుతాను ఉపేక్షించుకుని,* తన సిలువనెత్తుకుని నన్ను వెంబడింప వలెను” అని యేసు శిష్యులనుద్దేశించి అన్నారు (మత్తయి 16:24; నొక్కి చెప్పింది చేర్చ బడింది).

జీవ ద్వారమున ప్రవేశించుట ఎలాగు మరియు క్రైస్తవుడగుట ఎలాగు అన్న విషయాన్ని యేసు మరోచోట తెలయజేస్తున్నారు. రక్షణను గూర్చిన ప్రతి షరతులోనూ పూర్వపు ఏదో ఒక అంశాన్ని విడిచిపెట్టవలసిన అగత్యత కనబడుతుంది:

మనం యేసునందు నమ్మిక*యుంచాలి* (యోహాను 8:24). మరొక రక్షకునియందు విశ్వాసం లేదా నమ్మకం యుంచినవారికి ఈ ద్వారం మరింత ఇరుకుగా ఉంటుంది.

మన పాపములను బట్టి *మారుమనస్సు* పొందాలి (లూకా 13:3). తమ పూర్వపు జీవన విధానమును ఇంకా అట్టిపట్టుకొని యుండువారికి ఈ ద్వారము మరింత ఇరుకుగా ఉంటుంది.

మనమాయన నామమును జనులందరి యెదుట ఒప్పుకోవాలి (మత్తయి 10:32), యేసు కొరకు బహిరంగముగా ప్రజల యెదుట నిలువని వారికి ఈ ద్వారం మరింత ఇరుకుగా ఉంటుంది.

మనం రక్షించబడుటకు నీటిలో మునిగి *బాప్తిస్మం* పొందాలి (మార్కు 16:16). ఆయనకు విధేయులైయుండుటకు సమ్మతించని వారికి ఈ ద్వారం మరింత ఇరుకుగా ఉంటుంది, “మీరు నన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలను గైకొందురు” అని ప్రభువు చెప్తున్నారు (యోహాను 14:15).

ఇది క్రీస్తు విధానమన్న విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాను, “నేనే ద్వారమును, నా ద్వారా ఎవడైన లోపల ప్రవేశించిన యెడల వాడు రక్షింపబడును” (యోహాను 10:9ఎ) అని యేసు చెప్తున్నారు. ఇంకనూ ఆ ద్వారము గుండా ప్రవేశింపని వారిని గురించి “ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును” (మత్తయి 11:28; నొక్కి చెప్పింది చేర్చబడింది) అని యేసు అంటున్నారు. ఈ ద్వారం ఇరుకయినది మరియు చిన్నది అయినా గాని దేవుని యొద్దకు వచ్చుటకు ఇష్టపడువారు ప్రవేశించుటకు తగినంత స్థలము, విశాలత ఇందులో ఉంది.

**రెండు గుంపులు**

మన వాక్యభాగం రెండు రకాల గుంపులను గురించి కూడ తెలియజేస్తుంది. ఇందులో ఒక గుంపు పేరు “అనేకులు”; “వెడల్పు ద్వారముగుండా ప్రవేశించువారు అనేకులు.” విశాలమైన దారిలో అనేకమంది ఉన్నారు. ఈ దారి గుంపులకు, జనుల సమూహమునకు దారి, “అందరూ అలానే చేస్తున్నారు” అనేది ఈ దారి యొక్క సందేశం లేదా ప్రధాన వాక్యం. మోషే ఇశ్రాయేలు ప్రజలకు హితబోధ చేస్తూ, “దుష్కార్యము చేయుటకై సమూహమును వెంబడించవద్దు” (నిర్గమకాండము 23:2ఎ) అని తెలియజేస్తున్నాడు. అతడు ఈ ఆజ్ఞను ఎందుకు ఇచ్చాడు? ఎందుకంటే సహజంగానే సమూహమును చూచి వెంబడిస్తాము మనం.

“అనేకులు” అనే గుంపుతో పాటు చెప్పబడిన మరో గుంపు “*కొందరు.*” “జీవమునకు పోవు ద్వారము ఇరుకును, ఆ దారి సంకుచితమునైయున్నది. దానిని కనుగొనువారు కొందరే” అని యేసు చెప్తున్నారు. యేసు చెప్పిన ఈ మాట “విస్మరించబడిన యేసు మాటగా” పిలువబడుతుంది.[10]

“కొందరు” అన్న మాట పోలికను తెలియజేసే సారూప్య పదం. చాలా కాలం క్రితం నేను ఒక పద్యాన్ని విన్నాను. రక్షించబడినవారి సంఖ్యను మరింత సూక్ష్మీకరించి చెప్పబడిన పద్యం ఇది. ఇందులోని ఆఖరి వాక్యాలు ఈ విధంగా ఉన్నాయి. ఇక ఆఖరకు మిగిలింది నీవు, నేనే కాని, కొన్నిసార్లు “నీ గురించి నేను ఖచ్చితంగా చెప్పలేను.” “కొందరు” అంటే

ఎవరూలేరని అర్థంకాదు. ప్రకటన గ్రంథంలో రక్షింపబడిన వారిని గురించి "యెవడును లెక్కింపజాలని ఒక గొప్ప సమూహము" (7:9) అని చెప్పబడింది. అయితే, ఈ విశాల దారిలోనున్న గుంపుతో పోలిస్తే ఈ గుంపు కొద్దిమంది మాత్రమే.

నమ్మకస్థులు ఎప్పుడు అల్ప సంఖ్యలోనే ఉంటారు. నోవహు దినములలో "కొద్దిమంది అంటే, కేవలం ఎనిమిది మంది మాత్రమే రక్షింపబడ్డారు (1 పేతురు 3:20). వాస్తవానికి ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడిచిపెట్టినప్పుడు వారు ఆరు లక్షలమంది కాల్బలము గల వీరులు" (నిర్గమకాండము 12:37 చూడు); అయితే ఇంతమంది బయలుదేరినాగాని, కేవలం కాలేబు మరియు యెహోషువాలు మాత్రమే వాగ్దాన దేశంలో ప్రవేశించారు. కేవలం "శేష జనం" మాత్రమే రక్షింపబడతారని క్రొత్త మరియు పాత నిబంధనలలో తెలియజేయబడింది (యెషయా 10:21, 22; రోమీయులకు 11:5ను చూడు). "పిలువబడినవారు అనేకులు, కాని ఏర్పరచబడినవారు కొందరే" అన్న మాటలతో యేసు ఒక ఉపమానాన్ని ముగిస్తున్నారు (మత్తయి 22:14). ఈ దినాన కూడ దేవుని ప్రజలు అల్పసంఖ్యాకులే.

"ప్రతి ఒక్కరూ దేవున్ని సంతోషపరచలేరన్నది" మత్తయి 7వ అధ్యాయం యొక్క సందేశమని నా సహోదరుడు కాయ్ ఒక వర్తమానంలో పేర్కొన్నాడు.[11] అయితే లోకం దీనిని ఒప్పుకోదు. మేము ఉంటున్న ప్రాంతంలో చనిపోయిన వారి గురించి ఒక నమ్మిక ఉంది. ఒక వ్యక్తి మంచివారైనా, చెడ్డవారైనా చనిపోతే అతడు వెలుగుమయ ప్రాంతానికి కొనిపోబడతాడు. అక్కడ అతన్ని ప్రేమించే వారనేకులు అతడి కోసం ఎదురు చూస్తుంటారు. అయితే పరిస్థి ఇలా ఉండదని ప్రభువు తెలియజేస్తున్నారు. యేసు ప్రకారం, అనేకమంది, "చీకటి బిలాం" వైపే పయనిస్తున్నారు (మత్తయి 8:12; 22:13; 25:30). కొంతమంది మాత్రం వెలుగు రాజ్యం వైపు పయనిస్తున్నారు (ప్రకటిన 22:5).

"కొద్దిమందిలో" ఒకడిగా ఒంటరిగా ఉండడం నిరుత్సాహానికి గురి చేసేదే. "వాక్యం ఈ విషయాన్ని చాలా స్పష్టంగా చెప్తుంది గదా! *ప్రతి ఒక్కరూ* దాన్ని ఎందుకు చూడలేరు?" అని సంఘస్తులు అడిగారు. నేనైతే ఈ ప్రశ్నకు జవాబు చెప్పలేను. కాని ప్రభువు అందులోనే జవాబునిస్తున్నారు. ప్రతి ఒక్కరూ సత్యమును అర్థం చేసుకొనలేరని, గైకొనలేరని ఆయన చెప్తున్నారు. ఈ మార్గం ఇలాంటిదే! ఈ ఇరుకైన మార్గం షరతులతో కూడినది. ఇది కఠినమైన మార్గం కూడాను. అలాగే ఇది ఒంటి మార్గం కూడాను. "ఇలా అయితే, ఈ మార్గంలోని కొద్దిమందిలో నేనూ ఒకడిగా ఉండాలనుకోవడం లేదు" అని ఒకరు అనవచ్చు – ఇటువంటి నిర్ణయానికి వచ్చేముందు నాల్గవ వ్యత్యాసాన్ని చూడండి.

**రెండు గమ్యములు**

విశాలమైన మార్గము "*నాశమునకు దారి* తీస్తుంది." "నాశము" (*apollumi*) అన్న మాటకు "పూర్తిగా నశించుట" అని అర్థము; అయితే, "ఇది నిర్మూలించుట కాదు గాని, పాడైపోవుట, కోల్పోవుట, మన వృద్ధిని నశింపచేయుట."[12] ఈ లోకంలో ఒక వ్యక్తి తన సద్గుణమును కోల్పోవచ్చు. కాని, ఈ లోకంలోని యాత్ర తరువాత ఆ వ్యక్తి తన ఆత్మనే కోల్పోతాడు. "ఒకనియెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు. అయితే తుదకు అది మరణమునకు త్రోవతీయును" (సామెతలు 14:12; చూడు 16:25) అని సొలొమోను వ్రాస్తున్నాడు. "మరణము" "ఎడబాటును" సూచిస్తుంది. ఆత్మీయ మరణం

దేవునినుండి మనలను దూరం చేస్తుంది (చూడు యెషయా 59:2). “రెండవ మరణము” (ప్రకటన 20:14; 21:8) అనగా దేవుని సన్నిధినుండి శాశ్వతంగా దూరం కావడం (2 థెస్సలొనీకయులకు 1:8, 9). ఇరుకు దారి ప్రవేశ ద్వారము దగ్గర, మొదట మనం కట్ట వలసిన “వెల” గురించి “భయపడి” అనేకమంది ఇది కష్టతరముగా భావిస్తారు. కాని విశాల మార్గము *అంతములో* చెల్లింపవలసిన వెలతో పోలిస్తే ఇది ఏమంత కష్టతరం కాదు.

విశాలమైన మార్గము నాశనమునకు నడిపిస్తుంది కానీ. ఇరుకైన మార్గం జీవమునకు నడి పిస్తుంది. “గొఱ్ఱెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని” (యోహాను 10:10బి) యేసు చెప్పారు. ఆత్మీయ మరణం దేవునినుండి మనలను దూరం చేస్తుంటే, ఆత్మీయ జీవము దేవునితో మనలను సమైఖ్యపరుస్తుంది. ఆయనలో సహవాసం కలిగి ఉండేలా చేస్తుంది. యోహాను 17లో యేసుని గొప్ప ప్రార్థనలో ఆయన ఈలాగు ప్రార్థిస్తున్నారు “అద్వితీయ సత్య దేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసు క్రీస్తును ఎరుగుటయే నిత్య జీవము” (3 వచనం). ఇరుకు మార్గంలో దేవునితో, క్రీస్తుతో మన సహవాసం ప్రారంభమవుతుంది. పరలోకంలో ఇది పరిపూర్ణమవుతుంది.

ప్రజలను దేవునివైపు తీసుకురావడానికి మనం ప్రోత్సాహకర మాటలను ఉపయోగించాలా లేక బెదిరుంపు మాటలను ఉపయోగించాలా అన్న విషయం పై చర్చను మనం వింటునే ఉంటాం. యేసు ఈ రెండింటిని ఉపయోగించారు. నాశనమునకు దారితీయు మార్గమును గురించి చెబుతూ, “ఆ దారిలో మీరు *వెళ్ళకండి*” అని సూచన ప్రాయంగా చెబుతున్నారు. జీవమునకు దారితీయు మార్గమును గురించి చెబుతూ, “మీరు ఆ దారిలో పయనించాలని అనుకొంటున్నారు” అని ఆయన సూచిస్తున్నారు.

మనకు నాలుగు వ్యత్యాసాలు కనబడుతున్నా గాని, రెండే మార్గాలున్నాయి. ఒకటి నాశనమునకు దారితీయు విశాల మార్గమయితే మరొకటి జీవమునకు దారితీయు ఇరుకు మార్గము. ఆర్. డబ్లూ స్టాట్ ఈ విధంగా వ్రాస్తున్నాడు,

> ... ప్రభువు చెప్పిన ప్రకారం, మనకు రెండు మార్గాలున్నాయి. సులువైనది మరియు కష్టమైనది (మరో మధ్య మార్గం లేదు). వీటిని రెండు ద్వారముల ద్వారా ప్రవేశింపవచ్చు. ఇరుకు మరియు విశాల ద్వారములు (మరో ద్వారం లేదు). రెండు రకాల ప్రజలు వీటిలో ప్రవేశిస్తారు. బహు జనసమూహాము మరియు కొద్దిమంది (మరో మధ్య గుంపు లేదు). వాటికి రెండు గమ్యములున్నాయి నాశనము మరిము జీవము (మరో గమ్యం ఏదీ లేదు).[13]

## మీరు ఎవరు మాటలను అనుసరిస్తున్నారు? (7:15-20)

“మీరు ఏ దిశగా పయణిస్తున్నారు?” అన్న ప్రశ్నకు సమాధానమివ్వాలంటే ముందుగా మీరు ఏ మార్గంలోనున్నారో గుర్తెరగాలి. అలాగే రెండవ విషయం కూడ ఉంది. మీరు ఎవరి మాటలను అనుసరిస్తున్నారు అన్న విషయాన్ని తెలుసుకోవాలి. యేసు ఒక్కరే మనకు బోధచేయడంలేదు. “నీవు ఇక్కడకు వెళ్ళు, అక్కడకు వెళ్ళు. ఇది చేయి, అది చేయి” అని లెక్కలేనన్ని స్వరాలు మనకు బోధిస్తున్నాయి. యేసు రెండు మార్గాలను గురించి చెబుతూ ఈ మార్గాలనుండి ప్రజలను చెల్లాచెదురు చేసే వారి గురించి ఆయన హెచ్చరిస్తున్నారు.

**రెండు రకాల మార్గోపదేశకులు**

మార్గాలు రెండు ఉన్నట్లే, మార్గోపదేశకులు కూడ రెండు రకాలవారు ఉన్నారు. కేవలం చెడ్డ మార్గ దర్శకుల గురించి ఇక్కడ చెప్పబడినా గాని *మంచి మార్గదర్శకులు కూడ* ఉంటారన్న భావనను ఇది తెలియజేస్తుంది.

ఈ మార్గదర్శకులు "ప్రవక్తలుగా" పిలువబడ్డారు. "ప్రవక్త" (prophet) అను మాట భాషాంతరము చేయబడిన గ్రీకు పదం (*prophetes*) దీనికి "ముందు మాట్లాడేవాడు"[14] అని అర్థం. సహజంగా ఇది దేవుని పక్షంగా మాట్లాడే వ్యక్తిని సూచిస్తుంది. మొదటి శతాబ్దంలో వీరు దేవునినుండి సందేశం పొందుటనుండి; దేవుని వాక్యంనుండి సందేశం పొందేవారిచే మార్చబడ్డారు.[15] వీరు వాక్య బోధకులు. పౌలు తిమోతికి ఇచ్చిన ఆజ్ఞననుసరించిన బోధకులు మరియు ఉపదేశకులను బట్టి దేవునికి కృతజ్ఞతలు: "వాక్యమును ప్రకటించుము; సమయమందును, అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము గద్దించుము బుద్ధి చెప్పుము" (2 తిమోతి 4:2)!

విచారకరమైన విషయమేమంటే, వీరుగాక *చెడ్డ మార్గదర్శకులు* కూడ ఉన్నారు. వీరిని ప్రభువు "అబద్ధ ప్రవక్తలని" పిలుస్తున్నారు. వీరు దేవుని పక్షముగా మాట్లాడుతున్నామని బుకాయిస్తారు. అలాగే వీరి సందేశం దైవావేశపూరితమైనదనీ బుకాయిస్తారు. వీరిని గురించి యేసు ఈలాగు చెప్తున్నారు,

> అబద్ధ ప్రవక్తలను గురించి జాగ్రత్త పడుడి. వారు గొఱ్ఱెల చర్మములు వేసికొని మీ యొద్దకు వత్తురు కాని లోపల వారు క్రూరమైన తోడేళ్లు (మత్తయి 7:15).

"అబద్ధం" అనే మాట "అసత్యం" అనే గ్రీకు పదం (*pseudes*) నుండి వచ్చింది.[16] సత్యబోధనల ద్వారా మనలను మోసపుచ్చే అబద్ధ బోధకుల గురించి మనం జాగ్రత్తపడాలని యేసు హెచ్చరిస్తున్నారు.

మన వద్ద స్నేహపూర్వకంగా ఉండే బుజ్జిపిల్లిని పెంచుకుంటూ ఇంటి గేటువద్ద "కుక్కలున్నాయి జాగ్రత్త!" ("BEWARE OF THE DOG!") అని పెద్ద బోర్డు పెట్టుకుంటే ఏమీ అర్థం ఉండదు దానికి.[17] అబద్ధ బోధకుల గురించి యేసు హెచ్చరిస్తున్నారంటే, ఆయన కాలంలో వారున్నారని అర్థం. అలాగే వారు ఈ అన్ని కాలాల్లోను ఉన్నారు. యేసు కొండమీద ఈ ప్రసంగాన్ని చేస్తున్నప్పుడు ఆయన మనసులో శాస్త్రులు, పరిసయ్యులు ఉండి ఉండవచ్చు. కాని ఈ అబద్ధ ప్రవక్తలు కేవలం ఆ గుంపుకే పరిమితం కాలేదు. యెరూషలేము నాశనము జరుగుటకు ముందు "అనేకమైన అబద్ధ ప్రవక్తలు వచ్చి పలువురిని మోసపరచెదరు" (మత్తయి 24:11; 5, 24 చూడు) అని యేసు చెప్తున్నారు. "భిన్నమైన సువార్తను" బోధించే అబద్ధ బోధకుల గురించి పౌలు హెచ్చరిస్తున్నాడు (గలతీయులకు 1:6-9). 2 తిమోతిలో పౌలు ఇద్దరు అబద్ధ బోధకులను గురించి తెలియజేస్తూ "వారు సత్యము విషయము తప్పిపోయి, కొందరి విశ్వాసమును చెరుపుచున్నారు" (2:17, 18) అని వివరిస్తున్నాడు. "మరియు అబద్ధ ప్రవక్తలు ప్రజలలో ఉండిరి. అటువలెనే మీలోను అబద్ధ బోధకులుందురు; వీరు తమ్మును కొనిన ప్రభువును కూడ విసర్జించుచు, తమకుతామే శీఘ్రముగా నాశనము కలుగజేసికొనుచు, నాశనకరమగు భిన్నాభిప్రాయములను రహస్యముగా బోధించుదురు" (2 పేతురు 2:1ఎ) అని పేతురు క్రైస్తవులను హెచ్చరిస్తున్నాడు.

అనేకమంది అబద్ధ బోధకులు తమను తాము మోసపరచుకుంటారు (7:21-23 చూడు), కాని కొంతమంది అలాకాదు, ఎందుకని అబద్ధ బోధకులు బయలుదేరుతున్నారు? నేను యితరుల హృదయాంతరంగాలను పరిశీలించలేను లేదా వారి ఉద్దేశాలను మార్చలేను. కాని ఇందుకు తగిన కారణాలు అనేకం మనకు కనబడతాయి.

*సంపాదన.* కొంతమంది బోధకులు మరియు ఉపదేశకులకు KJVలో వాడబడిన "జీతగాల్లు" అన్న మాట (యోహాను 10:12, 13) చక్కగా సరిపోతుంది: కొంతమంది డబ్బుకోసం ఉద్యోగం చేసినట్లు ఈనాడు వీరు చేస్తున్నారు. వీరిని గురించి మరియొక మాట కూడ నా మనసుకు తట్టింది - "వారి కడుపే వారికి దేవుడు" (ఫిలిప్పీయులకు 3:19).

*ఖ్యాతి.* ఆది సంఘపు కాలంలో కొంతమంది బోధకులు అగుటకు ఆసక్తి చూపించారు ఎందుకంటే సంఘంలో బోధకునికి లభించే కీర్తి, ఖ్యాతి ఎంతో గొప్పగా ఉండేవి. ఇందుకనే యాకోబు యిలా అంటున్నాడు: "నా సహోదరులారా, బోధకులమైన మనము మరి కఠినమైన తీర్పు పొందుదుమని తెలుసుకొని మీలో అనేకులు బోధకులు కాకుండుడి" (యాకోబు 3:1).

*అధికారం.* దియొత్రెఫే వంటివారు కొందరు సంఘంలో ప్రధానత్వము కొరకు ఆశపడుతున్నారు (3 యోహాను 9). తమ ఉద్దేశమును, యిష్టమును ఇతరులపై కూడ వేయాలని వారు చూస్తారు.

అబద్ధ బోధకులు తమ్మును తాము మోసపరచుకున్నా లేక ఉద్దేశపూర్వకంగానే చేస్తున్నా, వారి ఉద్దేశం ఏదయినా గాని, వారి గురించి రెండు విషయాలను మన వాక్య భాగం తెలియజేస్తుంది. మొదటిగా వారు *ప్రమాదకరమైనవారు.* యేసు వారిని "తోడేళ్లుగా" పిలుస్తున్నారు. దేవుని సంఘం, దేవుడు మేపే గొర్రెల మంద (అపొస్తలుల కార్యములు 20:28). సహజంగానే గొర్రెలకు తోడేళ్లు హాని చేస్తాయి (యోహాను 10:12, 13). రక్త దాహం కలిగియున్న తోడేళ్ల ముందు ఈ గొర్రెలు శక్తిలేనివి, బలహీనమైనవి. "నేను వెళ్లిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్లు మీలో ప్రవేశించునని నాకు తెలియును" (అపొస్తలుల కార్యములు 20:29) అని పౌలు ఎఫెసు సంఘాన్ని హెచ్చరిస్తున్నాడు. యేసు వారిని క్రూరమైన (*harpax*) తోడేళ్లుగా నిర్ణయిస్తున్నాడు. తోడేళ్లు ఆకలిగొంటే పిచ్చిగా ప్రవర్తిస్తాయి. వీటిని ఈ విధంగా ఊహించండి, అనేక తోడేళ్లు గుంపుగా చేరి, కళ్ళు చిట్లించి, వాడియైన పళ్ళను బయట పెట్టి, నోటిలోనుండి లాలాజలం కార్చుతూ, మీ మీద పడి చీల్చివేయడానికి సిద్ధంగా ఉన్నాయి.

అబద్ధ బోధకులు కేవలం ప్రమాదపరులే కాదు, వారు మోసగాళ్ళు కూడాను. వారు "గొర్రెల చర్మములను కప్పుకుని" వస్తారు (1 రాజులు 19:19). యేసు దీనిని ఒక ఉపమాన రూపముగా చెప్పారు. క్రూరమైన తోడేళ్లు ఎప్పుడును క్రూరముగా ఉండవు, అవి హానికరం కాని, ప్రమాదకరం కాని గొర్రెలవలె అవి ప్రవర్తిస్తాయి. అబద్ధ ప్రవక్తలు "అపొస్తలుల వేషము," "నీతి పరిచారకుల వేషము" (2 కొరింథీయులకు 11:13, 15) అను ముసుగు కప్పుకుని యుంటారని పౌలు హెచ్చరిస్తున్నాడు.

"ఇదిగో నేను అబద్ధ బోధకుడిని" అని ప్రకటించుకుంటూ సంఘములో ప్రవేశింపరు. వారి భుజముల మీదు, ఛాతిమీద "అబద్ధ బోధకుడు" అన్న బ్యాడ్జిని తగిలించుకుని వారు తిరగరు. వారందరు బోధకులవలె మంచి వస్త్రములనే ధరిస్తారు. వారి మాటలన్నియూ మత సంబంధమైనవైయుంటాయి. వారు వాక్యమునుండి అన్ని వాక్య భాగాలను ఉల్లేఖించగలరు.[18]

వారి మాటలన్నియు మంచిగానే ఉంటాయి.[19] ఇవన్ని కలిపి వారిని మరింత ప్రమాదకరముగా మారుస్తాయి. క్రైస్తవులు కేవలం తగిన వారినే నమ్ముటకు బోధింపబడ్డారు. ఇటువంటి వారు అబద్ధ బోధకులనుండి తప్పించబడుటకు బోధించబడ్డారు. అబద్ధ బోధకులను గురించి యూదా వ్రాస్తూ, వారు "రహస్యముగా జొరబడియున్నారు" (4 వచనం) అని వ్రాస్తున్నాడు. ఈ మాట *pareisduno* అన్న గ్రీకు పదం నుండి వచ్చింది. దీనికి "చాటునుండి ప్రవేశించడం"[20] అని అర్థం. వారు "వెనుక ద్వారంనుండి రహస్యముగా జొరబడుచున్నారు" అని ఒకరు చెప్పారు.[21]

**అబద్ధ బోధకులను గుర్తించడం ఎలా**

అబద్ద బోధకులు మోసగాళ్ళు అయితే వారిని ఎలా గుర్తిస్తాం?[22] ఎలా అన్న విషయాన్ని ప్రభువు తరువాత భాగంలో తెలియజేస్తున్నారు, యేసు తన ఉపమానమును పచ్చిక బయళ్ళనుండి ఫలవృక్ష తోటకు మళ్ళిస్తున్నారు. "వారి ఫలమువలన మీరు వారిని తెలిసికొందురు" (16ఎ వచనం; చూడు వచనం 20) అని ప్రభువు చెప్తున్నారు. "తెలిసికొనుట" *epiginosko* అను మాటనుండి వచ్చింది. ఇది "తెలుసుకొనుట" *ginosko* అను పదమునకు ముందు *epi* అను విశేషణమును చేర్చుట వలన వచ్చినది. దీనికి "పూర్తిగా ఎరుగుట"[23] అని అర్థం. మరో మాటలో చెప్పాలంటే మనం వారిని నిజముగా గుర్తించాలంటే వారి ఫలమువైపు మనం తేరి చూడాలి.

సహజంగా ప్రజలు ఫలమును కనుగొనే విధానాన్ని ప్రభువిక్కడ ప్రస్తావిస్తున్నారు, "ముండ్ల పొదలలో ద్రాక్షపండ్లనైనను, పల్లేరు చెట్లను అంజూరపు పండ్లనైనను కోయుదురా?" (16 వచనం) అని ప్రభువు ప్రశ్నిస్తున్నారు. "ద్రాక్షపండ్లు కోయడానికి ముండ్లపొదల్లో వెదికే ప్రజలను, అంజూరపు పండ్లను కోయడానికి ముండ్లచెట్లలో దూరే ప్రజలను మీరు ఊహించగలరా"?[24]

ఆయన యిలా కొనసాగుతున్నాడు,

> అలాగుననే ప్రతి మంచి చెట్టు మంచి ఫలములు ఫలించును, పనికిమాలిన చెట్టు కాని ఫలములు ఫలించును, మంచి చెట్టు కాని ఫలములు ఫలింపనేరదు. పనికి మాలిన చెట్టు మంచి ఫలములు ఫలింపనేరదు (17, 18 వచనాలు).

"మంచి చెట్టు" అంటే తన కర్తవ్యాన్ని తాను సమర్థవంతంగా నిర్వర్తించిన చెట్టు. తన పండ్లను అందివ్వడమే దీని కర్తవ్యం. "పనికి మాలిన చెట్టు తన దగ్గర పండ్లను అందివ్వదు."[25] దీనర్థం ఒక మంచి చెట్టు తినుటకు పనికిరాని పండ్లను అందివ్వలేదని అర్థం. ఒక మంచి ఆపిల్ చెట్టు కూడ పురుగులున్న పండ్లను యిస్తుంది. అలాగే ఎంత పనికిమాలిన చెట్టయినా గాని ఒక్కసారి మంచి ఫలమునే యిస్తుంది. సాధారణంగా ఒక పళ్ళ చెట్టు చేసే సహజ ధర్మాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభువు ఈ మాట చెప్పారు.

మన బోధకులకు ఈ ఫల పరీక్షను ఏ విధంగా నిర్వహించగలం? దీనికి, విభిన్న రకాల ఫలములు ఉన్నాయని ఇందుకు విభిన్న రకాల "ఫల పరీక్షలు" అవసరమని అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు సిద్ధాంత పరీక్ష: బోధకుడు బోధిస్తున్న విషయం. హెబ్రి పత్రికనుండి ఒక వాక్యాన్ని తీసుకున్నప్పుడు అతడి జిహ్వాఫలాన్ని మనం పరీక్షించాలి (హెబ్రీయులకు 13:15

చూడు). తన పాఠకులను కొంతమంది మోసగించడానికి ప్రయత్నిస్తున్నారని యోహాను చెప్తూ ఈలాగు వ్రాస్తున్నాడు (1 యోహాను 2:26 చూడు) "ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్లియున్నారు, గనుక ప్రతి ఆత్మను నమ్మక ఆ యా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి"[26] (1 యోహాను 4:1) వారిని ఎలా పరీక్షించాలి? వారు చెప్తున్న బోధను దేవుని వాక్య సత్యతతో పోల్చిచూడండి (అపొస్తలుల కార్యములు 17:11).

ఈ దినాన ఈ లోకంలో ఎన్నో అబద్ధ బోధనలు ప్రవాహంవలె బయలుదేరుతున్నాయి. ఒక్కొక్క రోజుకి ఒక్కొ కొత్త బోధ వెలుగు చూస్తుంది. ఇటువంటి అసత్య బోధనల విషయంలో మనం వాటిని ఎలా ఎదుర్కోవాలి? అని నాలో నేనే ప్రశ్నించుకుంటాను. ఇందుకు తగిన జవాబును నేను కనుగొన్నాను. దేవుని వాక్యాన్ని అనుదినం చదవడం, అధ్యయనం చేయడం, మరియు దానినే ధ్యానించడం వలననే అబద్ధ బోధనలను మనం ఎదుర్కొనగలం. దేవుని వాక్యం మన అంతరంగములో మిళితమైపోయివుంటే, మీరు తప్పుడు బోధనను విన్నప్పుడు దానిని గుర్తించగలరు. సిద్ధాంత పరీక్షకంటే ప్రాముఖ్యమైన పరీక్ష మరొకటి లేదు. ఒక వ్యక్తి వాక్యాన్ని బోధింపకున్నట్టయితే అతడు అబద్ధ బోధకుడు.

అబద్ధ బోధకుడిని అతడి బోధనల బట్టి అతడు అబద్ధ బోధకుడని అన్నివేళలా గుర్తించలేము. సాతానుడు కూడ వాక్యాన్ని చెప్పగలడు (మత్తయి 4:6). ఒక్కొక్కసారి అబద్ధ బోధకుడు తను బోధింపవలసిన దాన్ని బోధింపక పోవచ్చు.[27] కాబట్టి మనం మరో ఫలమును కూడ పరీక్షించాలి.

తరువాతదిగా, మనం ప్రవర్తనా పరీక్షను చూద్దాం. బోధకుని జీవిత విధాన ఫలమును మనం పరిశీలించాలి. అతడు చేస్తున్న పనుల్లో "ఆత్మ ఫలములు" (గలతీయులకు 5:22, 23) యొక్క జాడ ఉన్నదో లేదో కనుగొనాలి. చారిత్రిక ప్రతుల ప్రకారం అబద్ధ ప్రవక్తల బెడద సంఘ ఆరంభ దశలో ఎక్కువగా ఉండేది. రెండు, మూడు శతాబ్దాలలో వ్రాయబడిన డిడాకే[28] అను గ్రంథంలో అబద్ధ బోధకులను ఎలా గుర్తించాలో ప్రత్యేకంగా వ్రాయబడింది.[29] సువార్తికులు, బోధకుల నిమిత్తం క్రైస్తవులు తమ ఇంటిలో ఒక గదిని వారికి కేయాటించాలి. ఆ గ్రంథంలో తరువాతదిగా యిలా వ్రాయబడింది, "అతడు ఒక్క దినం మాత్రమే ఆ ఇంటిలో ఉండాలి, అవసరమైతే మరో రోజు ఉండవచ్చు. ఒకవేళ అతడు మూడు రోజుల అక్కడే ఉన్నట్టయితే అతడు అబద్ధ బోధకుడు." యిలా ప్రయాణించే బోధకుడు భోజనం కొరకు అడగవచ్చు కానీ, ఈ హెచ్చరిక చేయబడింది, "ఒకవేళ అతడు డబ్బుకోసం అడిగితే అతడు అబద్ధ బోధకుడు."[30] ఈనాడు మనం కూడ ఒక బోధకుడు ఎలా జీవిస్తున్నాడు, ఎలా ఉంటున్నాడు అన్న విషయాన్ని పరిశీలించాలి.

అన్ని వేళలా, అబద్ధ బోధకుని జీవితాన్ని ఆధారం చేసుకుని మనమతడిని గుర్తించలేము. కొంతమంది అబద్ధ బోధకులు ఎంతో నీతిమంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. అలా అయితే, మరి వారిని ఎలా గుర్తించగలం? ఆఖరి పరీక్ష, ఫలితాల పరీక్ష, అతడి బోధనలు ఎటువంటి ఫలములను ఇస్తున్నాయి? దేవుడు "నీతియను సమాధానకరమైన ఫలమును" కోరుకుంటున్నాడు (హెబ్రీయులకు 12:11). "నీతి ఫలము సమాధానము చేయువారికి సమాధానమందు విత్తబడును" (3:18) అని యాకోబు వ్రాస్తున్నాడు. విచారకరమైన విషయమేమంటె, అన్ని విత్తనములు (బోధన) నీతిని మొలిపించలేవు; అన్ని సమాధానమందు విత్తబడవు. అబద్ధ బోధన యొక్క దుష్ట ఫలములను మనం తిమోతి 2లో చూడగలం:

*భక్తిహీనత వృద్ధిపరచుట:* లోకానుసార వదరబోతులు "మరియెక్కువగా భక్తిహీనులగుదురు" (16 వచనం).

*అవిశ్వాస్యత:* అబద్ధ బోధన "కొరుకు పుండు ప్రాకినట్లు ప్రాకి" "కొందరి విశ్వాసమును చెరుపుతుంది" (17, 18 వచనాలు).

*కలహములు ప్రోత్సహించుట:* "నేర్పులేని మూడుల వితర్కములు జగడములను పుట్టించును" (23 వచనం).

మనము ఈ ప్రశ్నలను ప్రశ్నించుకోవాలి. అతడి బోధనల వలన ప్రజలు దేవునికి మరింత దగ్గరవుతున్నారా? వారు భక్తి జీవితం జీవిస్తున్నారా? వారు దేవుని వాక్యానికి లోబడి యుంటున్నారా? ఒకరి పట్ల ఒకరు ప్రేమ కలిగియుంటున్నారా?

ఈ ఫలము పరిపక్వం కావడానికి సమయం పడుతుంది కాబట్టి ఈ మూడవ పరీక్ష ఎక్కువ సమయం తీసుకుంటుంది. కాబట్టి మనం ఒక వ్యక్తిని అకారణంగా అబద్ధ బోధకునిగా ముద్రవేయకూడదు. జె. డబ్ల్యూ. మెక్‌గార్వ్ ఈ విధంగా వ్రాస్తున్నాడు, "మనం తొందరపడి విమర్శ చేయకూడదు. వారి క్రియలు, నడవడికను బట్టి తీర్పు తీర్చేయకూడదు. ఒక్కోసారి మంచి చెట్లకు కూడ పనికిరాని ఫలములు కాస్తుంటాయి."[31] మనం ముందుగానే చెప్పుకున్న ప్రకారం, ఒక మంచి యాపిల్ చెట్టు కూడ ఒక్కసారి పురుగులున్న ఫలములను ఇస్తుంది. కాబట్టి ఈ పరీక్షకు ఎంతో ఓపిక అవసరం. అలాగే మనం ప్రవర్తనా పరీక్షను మరువకూడదు. ఇది చాలా ముఖ్యమైనది.

### దీనిలోని తేడా ఏమిటి?

మన బోధకులు, ప్రవక్తలు, మంచివారైతే ఏంటి లేక చెడ్డవారైతే ఏంటి? దీనిలోని తేడా ఏమిటి? నాశనమునకు దారితీయు విశాల మార్గములో అబద్ధ బోధకులు ఉన్నారు (13 వచనం). యేసు చెప్తున్నారు,

> మంచి ఫలములు ఫలింపని ప్రతి చెట్టు నరకబడి అగ్నిలో వేయబడును (19 వచనముతో; 3:10 పోల్చి చూడు).

మేముంటున్న ప్రాంతంలో చక్కని ఆహ్లాదకర పచ్చని చెట్టు అందంగా వరుసగా ఉంటాయి. వీటన్నిటిని అలంకరణ కోసమనే నాటారు. పాలస్తీనాలో చెట్లను అలంకరణకోసం నాటరు. వాటిని వంటచెరకు కోసం, నిర్మాణం కోసం ముఖ్యంగా, పండ్ల కోసం పెంచుతారు. ఒక పండ్లచెట్టు మంచి పండ్లను ఫలింపలేక పోయినట్టయితే, అది మంచి చెట్లకు కావలసిన నేల సారాన్ని కూడ పీల్చుతూ ఎదుగుతుంది. కాబట్టి ఈ ఫలింపని చెట్టును నరికి వంటచెరకుగా వాడతారు. ఈ ఫలింపని చెట్లు, అబద్ధ బోధకులను సూచిస్తున్నాయి. అబద్ధ బోధకులు అగ్నిలో వేయబడతారని యేసు స్పష్టం చేస్తున్నారు. పేతురు అబద్ధ బోధకులను గురించి వ్రాస్తూ, వారు "తమకు తామే శీఘ్రముగా నాశనము" కలుగజేసికొనుచున్నారని తెలియజేస్తున్నాడు (2 పేతురు 2:1).

అబద్ధ బోధకులను అనుసరించువారి సంగతి ఏంటి? వారు కూడ అదే మార్గంలోనున్నారు నాశనమునకై పరుగిడుతున్నారు. "గ్రుడ్డివాడు, గ్రుడ్డివానికి త్రోవ చూపినయెడల వారిద్దరు గుంటలో పడుదురు గదా" అని ప్రభువు చెప్తున్నారు (మత్తయి 15:14). ఈ మాటను మనం

ఈ విధంగా మలుచుకోవచ్చు. ఒక అబద్ధ బోధకుడు ఒక పనికిమాలిన వానికి బోధిస్తే వారిద్దరూ నిత్య నాశనానికే వెళతారు. కాబట్టి ఇదే పెద్ద తేడా! నిత్యత్వములో తేడా, మనం సరియైన బోధనే గైకొనాలి.

మన బోధకులందరినీ, వారి బోధనలన్నిటిని మనం పరీక్షించాల్సిన బాధ్యత మనందరికీ ఉంది. తల్లి పక్షి ఏది పెడితే అది తినే పక్షి పిల్లలము కాదు మనము. బెరయాలోనున్న సంఘస్తుల గురించి లూకా మంచి మాట వ్రాస్తున్నాడు, "పౌలు చెప్పిన సంగతులు ఆలాగున్నవో లేవో అని ప్రతి దినమును లేఖనములు పరిశోధించుచు వచ్చిరి" (అపొస్తలుల కార్యములు 17:11). "ఆ సంగతులు" పౌలు చెప్పిన సంగతులు. అవి వాక్యంలో సరిపోలుతున్నవో లేదోనని వారు పరిశీలిస్తున్నారు. మనం వింటున్న బోధన విషయంలోనూ మనం ఇదే పనిచేయాలి. యోహాను చెప్పిన ఈ విషయాన్ని గుర్తుంచుకోండి. "ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్లియున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక ఆ యా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో *పరీక్షించుడి*" (1 యోహాను 4:1; నొక్కి చెప్పింది చేర్చబడింది).

**ముగింపు**

పాఠాన్ని ముగించపోతూ మరోసారి మిమ్ములను అడుగుతున్నాను, "మీరు ఏ దిశగా పయనిస్తున్నారు?" రెండు దారులున్నాయి. విశాలమైన దారి నాశనమునకు దారి తీస్తుంది. ఇరుకైన దారి జీవమునకు దారితీస్తుంది. మీరు ఏ దారిలో పయనిస్తున్నారు? మనకు రెండు రకాల మార్గదర్శకులున్నారు: ఒకరు అబద్ధికులు మరొకరు సత్యవంతులు. మీరు ఎవరిని అనుసరిస్తున్నారు? మనం ఏ దారిలో పయనించాలని ప్రభువు కోరుతున్నారో మనకు తెలుసు. మనకు ఎలాంటి మార్గదర్శకులు ఉండాలని ప్రభువు కోరుకుంటున్నారో మనకు తెలుసు.

"ప్రవేశించుడి" అని 7:13లో చెప్పిన మాటలు కేవలం హెచ్చరికే కాదు, ఇది ఆహ్వానం కూడాను. ఈ వాక్య భాగంలో యేసు మనలను కేవలం హెచ్చరించడం లేదు; ఆయన మనలను ఆహ్వానిస్తున్నాడు.[32] "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి" అని ఆయన అందరిని కోరుతున్నాడు.

---

సూచనలు

[1]Clovis G. Chappell, *The Sermon on the Mount* (Nashville: Abingdon-Cokesbury Press, 1930), 207. [2]William F. Arndt and F. Wilbur Gingrich, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 4th ed., rev. and aug. (Chicago: University of Chicago Press, 1957), 326. [3]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 426. [4]Archibald Thomas Robertson, *Word Pictures in the New Testament,* vol. 1 (Nashville: Broadman Press, 1930), 61. *Thlibo* అనే పదం *thlipsis* అను పదానికి సమాంతర పదం. ఇది "ఉపద్రవమును" సూచిస్తుంది. [5]మీ శ్రోతలకు అర్థమయ్యే విధంగా సులభమైన దారిని వివరించండి. నా మట్టుకు నేను నీడగానుండి, కొండ ప్రాంతంలో ప్రశాంతంగా ప్రకృతి వాడుతుండగా నడుచుకుంటూ వెళ్తున్న సన్నివేశాన్ని ఊహించుకుంటాను. [6]George W. Bailey, "The Narrow Gate and the Straitened Way," *The Preacher's Periodical* (now *Truth for Today*) (July 1982): 22. [7]Ibid., 36. [8]Arndt and Gingrich,7 73. [9]తన భారమునంతా వదిలించుకుని యేసుని అనుసరించలేని

సందర్భానికి ధనవంతుడైన యవ్వనస్థుడని చెప్పవచ్చు (లూకా 18:18–25). నిజానికి మనం క్రైస్తవులమయినప్పుడు. మనతో పాటు బోలెడంత భారాన్ని మోసుకు వస్తాం. దాన్ని వదిలించుకోవడానికి జీవిత కాలమంతా ప్రయత్నిస్తుంటాము. కాని మనము క్రైస్తవులుగా జీవితాన్ని ఆరంభిస్తున్నప్పుడు, పాపం పట్ల నూతన వైఖరి కలిగి, దినదినము యేసువలె అగుటకు ప్రయత్నించాలని మారుమనస్సు కోరుతుంది. [10]Manford George Gutzke, *Plain Talk on Matthew* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1966), 63.

[11]Coy Roper, "How to Please God," sermon preached at Trent church of Christ, Trent, Texas, 5 February 2006. [12]Vine, 164. [13]John R. W. Stott, *The Message of the Sermon on the Mount,* The Bible Speaks Today series (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1978), 196. [14]Vine, 493. [15]2 పేతురు 2:1లో అబద్ధ ప్రవక్తలు అబద్ధ బోధకులుగా చెప్పబడింది. [16]Vine, 367. "అబద్ధ ప్రవక్తలు" అనేది సంయుక్త గ్రీకు పదం. అబద్ధం అనుమాట ప్రవక్తలతో కలిసి *pseudoprophetes* అయింది (Vine, 493). [17]Stott, 197 నుండి తీసుకోబడింది. [18]సాతాను కూడ వాక్యాన్ని చెప్పగలడు (మత్తయి 4:6). [19]వాక్య భావం గాకుండా విభిన్న ఆక్షరంలో వారు చెబుతారు. కాని మతపర పదాలనే వాడుతారు. [20]Vine, 138.

[21]Alan Highers, "Beware of False Teachers," *Spiritual Sword* (April 2007): 1. [22]ఈ పదజాలం మీ శ్రోతలకు అర్థమవుతుందనుకుంటే, ఈ ప్రశ్న వేయండి, "గొఱ్ఱె చర్మం కప్పుకు వచ్చిన తోడేళ్లను మీరు ఎలా గుర్తిస్తారు?" [23]Adapted from Vine, 347; Robertson, 62. [24]Harold Fowler, *Matthew I,* Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1968), 426. [25]"పనికి మాలిన" అన్న పదానికి బదులు KJVలో "దుష్ట," "చెడుగు" అన్న పదాలు ఇయ్యబడ్డాయి; కాని, ఇది ఫలములకు సంబంధించినది కాబట్టి ఈ పదం కొంతవరకు సబబే. [26]యోహాను మనసులో నిర్దిష్ట అబద్ధ బోధన ఉంది. కాని యిక్కడ దీనిని మాత్రం అన్నింటికి అన్వయించవచ్చు. [27]మరో మాటలో చెప్పాలంటే అబద్ధ బోధకుడు ప్రేమ, దయ, కృప, వంటి అన్ని ముఖ్య విషయాలను గురించి బోధించవచ్చు. కాని "నీతి, ఆత్మనిగ్రహం, తీర్పు, రాకడ" వంటి ప్రాముఖ్య విషయాలను ప్రస్తావించడు (చూడు అపొస్తలుల కార్యములు 24:25). [28]*Didache* అనేది గ్రీకు పదం. దీనికి "సిద్ధాంతం" లేదా "బోధన" అని అర్థం. "ప్రభువు పన్నెండు మంది అపొస్తలుల ద్వారా అన్యజనులకు వ్రాసిన పత్రికగా" ఇది చెప్పబడింది. దైనందిన విషయాల పై ఇది సమగ్రంగా చర్చించిన కరపత్రిక (J. R. Michaels, "Apostolic Fathers," *The International Standard Bible Encyclopedia,* rev., ed. Geoffrey W. Bromiley [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979], 1:207.) [29]Didache 11.1-12.5. [30]Didache 11.9.

[31]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914), 267. [32]Bailey, 21.